05ATP27_05ATP27.qxd 28-12-2022 PM 10:35 Page 1



## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిను నిలదీసిన ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల సమస్యలు వింటున్న వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

మడకశిర టౌన్, డిసెంబర్ 28 ప్రభాతవార్త : మండలంలోని యాదవ కళ్యాణ మండపంలో సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాబోధనలో విలువలు అనుసంధానం అనే కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరయ్యారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ ఫార్టీ పశ్చిమ రాయలసీమ అనంతపురం, కర్నూలు, కడప పట్టభద్రుల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి యాదవ్ కళ్యాణ మండపంలో ఉపాధ్యాయులతో ముఖాముఖి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాన్ని తమ గోడును విన్నవించుకున్నారు. సిపిఎస్‌పై ప్రభుత్వం ఏ మాత్రం స్పందించలేదన్నారు. జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉక్కుపాదం మోపుతోందని, ఒకటవ తారీఖున ఇవ్వాల్సిన జీతాలు నెల మధ్యలో ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి జగన్ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయనను నిలదీశారు.

## తెలుగు దేశం నాయకుడు ఆకస్మిక మృతి



నివాళులు అర్పించిన జడ్పిటిసి

అగళి, డిసెంబర్ 28 ప్రభాతవార్త : మండల పరిధిలోని దాసేపల్లి గ్రామానికి చెందిన రెడ్డి (58) అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. టీడీపీ నాయకుడు ఆకస్మిక మృతివల్ల పార్టీకి తీరని లోటు అని జడ్పిటిసి ఉమేష్ అన్నారు. మృతుని పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వీరి వెంట సర్పంచు నరసింహమూర్తి, మాజీ ఎంపిటిసి మల్లన్న ఉన్నారు.

## కోనాపురంవద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

### -మహిళకు స్వల్ప గాయాలు



కోనాపురం గ్రామంవద్ద రోడ్డు పక్కకు దూసుకెళ్లిన కారు

ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : మండల పరిధిలోని పెన్నహోబిళం-కోనాపురం గ్రామం వద్ద బుధవారం ఉదయం ఒక కారు అదుపుతప్పి రోడ్డు ప్రక్కన పొలాల్లోకి దూసుకెళ్లగా అందులో ప్రయాణిస్తున్న ఒక మహిళకు స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. అనంతపురం నుండి బళ్లారికి వెళుతున్న కారు కోనాపురం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపు తప్పగా ఆ సమయంలో కారులో ఇద్దరు ఉన్నట్లు సమాచారం. గాయపడిన మహిళకు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించారు.

## నెరమెట్లలో విద్యార్థులకు ట్యాబుల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న నెరమెట్ల సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామ సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి సూచించారు. మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దన్న అధ్యక్షతన జరిగిన ట్యాబుల పంపిణీ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై 34 మంది 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి.యోగేంద్రరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే నాడు-నేడు కింద పాఠశాలలను ఆధునీకరించడం, అమ్మఒడి లాంటి పథకాలతో ఆర్థిక సాయం అందించడం, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో ప్రయోజనం చేకూర్చడం జరుగుతోందన్నారు. జగనన్న ఆశయానికి అనుగుణంగా అందరూ లక్ష్యంతో చదవాలని సూచించారు.

## రేషన్ బియ్యాన్ని ఎవ్వరూ అమ్ముకోవద్దు..!

### -కార్డు లబ్దిదారులకు సూచించిన ఆర్డీఓ జె.రవీంద్ర



ఉరవకొండలో ఎఫ్‌పీ షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జె.రవీంద్ర



చిన్నముష్టూరులో రేషన్ కార్డు లబ్దిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : రేషన్ బియ్యాన్ని ఎవ్వరూ అమ్ముకోవద్దని గుంతకల్లు ఆర్డీఓ జె.రవీంద్ర రేషన్‌కార్డు లబ్దిదారులకు సూచించారు. బుధవారం మధ్యాన్నం ఆయన పట్టణంలోని 22వ, చిన్నముష్టూరులోని 33వ ఎఫ్‌పీ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యంతోపాటు రాయితీ బియ్యాన్ని లబ్దిదారులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అన్న విషయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి ఆ ప్రాంతానికి చెందిన లబ్దిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని అది బలవర్ధకమైన ఆహారమన్నారు. అనేకమంది రాయితీ బియ్యం తినకుండా వ్యాపారులకు విక్రయిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని బియ్యం అక్రమ రవాణా వ్యాపారులను ప్రోత్సహించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, సీఎస్‌టీడీ డి.రమేష్‌బాబు, వీఆర్‌ఓలు మనోహర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడిగా మీరాన్ బాషా

### -ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సీఈఓ అబ్దుల్ ఖదీర్



వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన మీరాన్ బాషా

ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : అనంతపురం జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడిగా ఉరవకొండ పట్టణానికి చెందిన జి.యం.ఎస్.మీరాన్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సీఈఓ అబ్దుల్ ఖదీర్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన బుధవారం తెలిపారు. 7 మందితో నూతన కార్యవర్గంను ప్రభుత్వం నియమించిందని మీరాన్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు సభ్యుడిగా తన నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకముంచి అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ ముస్లింల సంక్షేమం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, మసీదుల అభివృద్ధికు కృషి చేస్తానని మీరం బాషా వెల్లడించారు.

## జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలిజయేస్తున్న దృశ్యం

గుడిబండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : శ్రీ సత్యసాయిజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.మంజునాథ్ జన్మదిన వేడుకలు మంగళగిరి తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు ఆధ్వర్యంలోకేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లోమడకశిర నియోజకవర్గం టిఎన్‌టియుసి అధ్యక్షులు బాలేపల్లి రాజు, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగానికి చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## తొలగించిన ఫించన్లు, రేషన్‌కార్డులను పునరుద్దరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

గుంతకల్లు టౌన్, డిసెంబర్ 28 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం వివిధ సాకులతో తొలగించిన ఫించన్లు, రేషన్‌కార్డులను పునరుద్దరించాలని సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాముడురాయల్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతే ఫించన్ మంజూరు చేయడం జరిగిందని కానీ అదే అధికారులు నేడు పలు సాకులతో వేల ఫించన్లు తొలగించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే ఆన్‌లైన్‌లో లోపం వుందని, ఓపెన్ కావడంలేదని సచివాలయాల చుట్టూ లబ్దిదారులను తిప్పుకుంటున్నారన్నారు. ప్రతి 20 మందిలో ఒకరి ఫించన్ తొలగించడం బాధాకరమన్నారు. 300 యూనిట్లు విద్యుత్ వాడారని, భూమి లేకున్నా వుందని ఇంటిలో ఉద్యోగం చేస్తున్నారని ఇలా ఎన్నో కారణాలు చూపుతూ ప్రభుత్వం ఫించన్లు తొలగించి అర్హులను ఇబ్బందికి గురిచేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, వికలాంగుల ఫించన్లు పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గౌస్, కుళ్లాయప్ప, ఉమర్‌బాష, రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యత ప్రమాణాలు పెంచుకోవాలి



విద్యార్థులకు మెమొంటో అందచేస్తున్న దృశ్యం

గుత్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త : నేటి సమాజంలో ఆధునిక పరిజ్ఞానానికి ధీటుగా విద్యార్థులు శాస్త్రీకదృకృథంతో తమ నైపుణ్యతను పెంపొందించుకోవాలని గేట్స్ కళాశాల ఎండి రఘునాథరెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతి సూచించారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం హానర్స్ సొసైటీ తరుపున 70 నుండి 100 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద, వైస్‌ప్రిన్సిపాల్ సిద్దేశ్వరరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ శాంతి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన గుత్తి విద్యార్థి



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో గుత్తికి చెందిన ఆర్‌కె యోగా సెంటర్ విద్యార్థి ప్రవీణ్‌ప్రసాద్ అండర్-12 విభాగంలో ప్రథమస్థానం పొందారు. అదేవిధంగా ఖ్యాతిరెడ్డి అండర్-14 విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను శిక్షకుడు రామకృష్ణతో పాటు పలువురు అభినందించారు.

## శరవేగంగా సిసిరోడ్డు నిర్మాణాలు



నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త : గుత్తి మున్సిపల్ పరిధిలో 14వ ఆర్థికసంఘం నిధులు దాదాపు 6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు, డ్రైనేజి నిర్మాణాలు వేగవంతమయ్యాయి. గుత్తి ఆర్‌ఎస్‌లో 3వ బ్లాక్ పరిధిలో 8 లక్షల అంచనాతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులను బుధవారం మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి వున్నామని అన్ని వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజిలు నిర్మిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వరలక్ష్మియాదవ్, ఎఇ శరత్‌చంద్ర, వైకాపా జిల్లా నాయకులు గురుప్రసాద్‌యాదవ్, షఫి, తదితరులు పాల్గొన్నారు.

## గుత్తిలో ఆటో బోల్తా

### -ఒకరు మృతి - 16 మందికి గాయాలు



బోల్తాపడిన ఆటో

గుత్తి, డిసెంబర్ 28 ప్రభాతవార్త : గుత్తి శివారు ప్రాంతంలోని గుంతకల్లు రోడ్డులో బ్రిడ్జి సమీపంలో బుధవారం సాయంత్రం డీజిల్ ఆటో బోల్తాపడడంతో అందులో వున్న ఒక మహిళా కూలి మృతి చెందగా మరో 16 మంది గాయపడ్డారు. వివరాలు ఇలా వున్నాయి. గుంతకల్లు రూరల్ మండలం వైటిచెరువు గ్రామానికి చెందిన మహిళా కూలీలు పెద్దవడుగూరు మండలం కాశేపల్లి గ్రామంలో పత్తిపనులకు ఆటోలో వెళ్లారు. తమ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ సంఘటనలో లక్ష్మీదేవి (45) అనే మహిళా కూలీ సంఘటనా స్థలంలో మృతి చెందింది. మరో 16 మంది గాయపడగా వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చెన్నమ్మ, సుంకమ్మ, సువర్ణ, సాలమ్మ, పెద్దక్కల పరిస్థితి విషమించగా వారిని జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## 31న రొద్దం పోలీసు స్టేషన్ వాహనాలకు బహిరంగ వేలం

రొద్దం, డిసెంబర్ 28 ప్రభాతవార్త : శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 48 ద్విచక్రవాహనాలు, 4 కార్లు, 3 ఆటోలలను ఈనెల 31న రొద్దం పోలీసు స్టేషన్‌లో పెనుకొండ సెబ్ అధికారులు సమక్షంలో వాహనాలకు బహరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఆసక్తి గల వేలం పాటదారులు ఆధార్‌కార్డు తీసుకుని రొద్దం పోలీసు స్టేషన్‌ను సంప్రదించి వేలం పాట రుసుము చెల్లించాలన్నారు. వేలం పాటదారులు ఈనెల 31న ఉదయం 9 గంటలకు పాల్గొన్నాలని ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

## రైతులు సుభ పద్ధతితో డ్రోన్ ద్వారా పంటకు మందు పిచికారి చేసుకోవచ్చు

### - జిల్లా వ్యవసాయ అధికారి వైవి. సుబ్బారావు



డ్రోన్ ద్వారా పంటకు పిచికారి చేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న అధికారి సుబ్బారావు

రొద్దం, డిసెంబర్ 28 ప్రభాతవార్త : బుధవారం రొద్దం మండల పరిధిలోని పెద్ద గువ్వలపల్లి గ్రామంలో రైతు జెట్టి మారుతిరెడ్డి పొలంలో సాగు చేసిన శనగ పంటకు డ్రోన్ ద్వారా క్రిమి సంహార మందుల పిచికారిపై రైతులకు, మండల వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వైవి. సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. రైతు జెట్టి మారుతిరెడ్డి పొలంలో శనగ పంటకు డ్రోన్ ద్వారా ఆపరేటర్‌తో పిచికారి చేయిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పంటలకు పిచికారి చేసుకుంటే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న పంటలకు మందులు పిచికారి చేయడానికి ఎక్కువగా శ్రమ పడకుండా పిచికారి చేయడానికి కూలీలతో ఇబ్బంది పడకుండా తక్కువ పెట్టుబడితో డ్రోన్ ద్వారా సులభపద్ధతిలో పంటలకు క్రిమి సంహారక మందులు పిచికారి చేసుకోవచ్చునని రైతులకు సూచించారు. పిచికారి చేసే డ్రోన్ యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జిల్లా వనరుల కేంద్రం సనావుల్లా రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎస్ఎన్, మల్లీశ్వరి, బి.కె కిశోర్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు కె. స్వయం ప్రభ తహశీల్దార్ అనంతచారి, ఎంపిడిఓ రాబర్ట్ విల్సన్, మండల వ్యవసాయ అధికారి కొత్తచెరువు యం. నటరాజ్, బుక్కపట్నం సతీష్, పెనుకొండ ఆర్. సురేంద్రనాయక్, సోమందేపల్లి బి. కవితారాణి, రొద్దం వ్యవసాయ అధికారి నివేదిత, ఎంఈవో అంజాద్, ఆర్‌బికె సిబ్బంది ప్రజా ప్రతినిధులు ఎంపిపి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణరెడ్డి, అంజనరెడ్డి, మారుతిరెడ్డి, రాజారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు రైతులు పాల్గొన్నారు.

## దళిత నాయకుల అరెస్టు హేయమైనచర్య

### - తేదేపా జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్



దళిత నాయకులను అరెస్టు చేస్తున్న దృశ్యం

గుడిబండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ రాష్ట్రఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్.రాజు ఆధ్వర్యంలో తేదేపాకు చెందిన దళిత నాయకులు మంగళగిరి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు, శ్రీ సత్యసాయిజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్‌లను దళిత నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తెలుగు దేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్ మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్‌నిధుల దుర్వినియోగం సంబంధించి అవినీతి అక్రమాలపై ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తే ఈ వైకాపా ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి దళిత నాయకులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దళిత నాయకులను అరెస్టు చేసినంత మాత్రాన తమ ఉద్యమం ఆగదని, దళితులకు న్యాయం జరిగే వరకు తెలుగు దేశం పార్టీ పోరాడుతుందని తెలిపారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడిబండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త : గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఎంపిపి రాధమ్మ, జడ్పిటిసి భూతరాజు, సర్పంచు యంజారేగౌడ్‌లు పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులు కావాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచులు రంగస్వామి, సతీష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులురమేష్, జమ్మలబండ పాండు, దాసరపల్లి బోరన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

### - రజక సంఘం నాయకులు



మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

ధర్మవరం, డిసెంబర్ 28 ప్రభాతవార్త : రజకులను ఎస్సీ జాబితాలోచేర్చాలని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ధర్మవరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో రజక సంఘం జిల్లా నాయకులు బద్దలాపురం నరసింహులు అధ్యక్షతన, పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేతి వృత్తి దారుల సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి సి.లింగమయ్య, టిడిపి రజక సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు నాగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సి.లింగమయ్య మాట్లాడుతూ.. గత దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో రజకుల బిసిఏలో ఉంటూ జీవనం సాగిస్తున్నామని, రజకులు చాలీ చాలని ఆదాయంతో దుర్భరమైన జీవితాలు గడుపుతూ కాలం వెల్లదీస్తున్నామని, జీవితాల్లోఎలాంటి అభివృద్ధి లేక ఎదుగుబోలేని జీవితాన్ని గడుపుతూ రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న రజకులు పట్టణాల్లోనూ గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకులాల చేతిలో ఎన్నో అవమానాలు భరిస్తూ నీ ఛాతి నీచమైన భాషలో అవమానాలు భరిస్తూ వారి మురికి దుస్తులు శుభ్రం చేస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నామన్నారు. కనుక ఇప్పటికైనా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశ్రూరు. ఈ కార్యక్రమంలో గొట్లూరు రామకృష్ణ, గంగాధర, రాధాకృష్ణ, నరసింహుల, రామాంజి, ముత్యాలమ్మ, మంజుళ, బయన్న, రాము, రామయ్య, రామాంజినేయులు, నాగేంద్ర, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్‌లో పట్టుబడిన వాహనాలకు వేలం

అగళి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు 29వ తేది గురువారం ఉదయం 10 గంటలకు అగళి పోలీస్‌స్టేషన్ వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వారి ఆధ్వర్యంలోవేలం పాట వేయనున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. ఇందులో పాల్గొన దలచిన వారు 29వ తేది 9 గంటలకు ఆధార్, పాన్‌కార్డులతో అగళి పోలీస్‌స్టేషన్‌కు రావాలన్నారు. రీ సెట్‌లో 10 శాతం, అడ్వాన్స్‌గా డిపాజిట్‌చెల్లించాలన్నారు. వేలంలో పాల్గొని పాట అనంతరం వాహనాలు దక్కించుకున్న వారు డబ్బులను జీఎస్‌టి డబ్బును ఛలానా రూపంలో ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు. ఈ అవకాశాన్ని వేలం పాట దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సజావుగా సాగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం...

### 2023-24వ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు... 22-23వ ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్ అంచనాలు... కౌన్సిల్ ఆమోదం- పార్టీలకు అతీతంగా జగనన్న సంకల్పంను ఓ లక్ష్యంగా పాలన అందిస్తున్నాం... - మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని - కౌన్సిల్ చట్ట నిభంధనలకు తూట్లుగా తీరు మారని వైనంలో కో ఆప్షన్ సభ్యులు...?- ప్రశ్నించని వైనంగా ఓవైపు అధికారులు, మరోవైపు ప్రతిపక్ష విపక్ష పార్టీ శ్రేణుల తీరు..?



కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానిలు.



కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న టిడిపి కౌన్సిలర్ కృపాకర్.

గుంతకల్లు, డిసెంబర్ 28 ప్రభాతవార్త : " గుంతకల్లు పురపాలక సంఘం " 2023-24వ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలు, 2022-23వ ఆర్థిక సంవత్సరంనకు సంబందించి సవరించిన బడ్జెట్ అంచనాలపై కౌన్సిల్ తీర్మాణాల ఆమోదంపై చర్చలు సజావుగా సాగాయి. బుధవారం గుంతకల్లు పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న పర్యవేక్షణలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన కౌన్సిల్ వారి అత్యవసర సమావేశంతో పాటు బడ్జెట్ అంచనాలు తదితర అంశాలపై సమావేశం జరిగింది. సదరు సమావేశంలో భాగంగా పట్టణ అభివృద్ధిలో భాగంగా నూతనంగా ఒక సచివాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించడం, దాదాపు రూ.7కోట్లు నిధులు అదనంగా మున్సిపాల్టీకి ప్రభుత్వం అందించనుందని మున్సిపల్ కమీషనర్ పేర్కొన్నారు. పట్టణంలోని లబ్దిదారులు అనర్హులుగా గుర్తించిన పించన్‌దారుల దరఖాస్తుల పరిశీలనలో భాగంగా ప్రత్యేక అధికార బృందంచే ప్రస్తుతం 1135 పించన్లు రీ వెరిఫికేషన్‌చర్యలు జరుగుతున్నాయన్నారు. జనవరి మాసంలో వారి పించన్ పంపిణీలో ప్రభుత్వం ఆదేశాల ఉత్తర్వుల మేరకు చట్టబద్దంగా తాము ప్రవరి ్తంచి ప్రజలకు లబ్దిచేకూర్చుతామని, ప్రస్తుతం తాను ఒకటో తేదీ పంపిణీ జరుగుతుందని నిక్కచ్చిగా చెప్పలేనని పేర్కొనడం గమనార్హం. ప్రజల నుండి మున్సిపాల్టీకి ఆదాయంగా ప్రతి ఇంటి నుండి రూ.30ల నుండి రూ.60ల దాకా యూజర్ చార్జీల వసూలు తప్పనిసరిగా ఉంటుందని ప్రతి ఒక్కరూ ఆమోదించి సహకరించాలన్నారు. కాగా మున్సిపల్ కౌన్సిల్ చట్ట నిభంధనలకు తూట్లుగా కో ఆప్షన్ సభ్యుల తీరుండటం శోచనీయం. గతంలో పలుమార్లు సూచి ంచినా వారి తీరులో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్న గుసగుసలు వినిపిస్తున్న తీరు లేకపోలేదు. సమావేశం మధ్యలో కలుగచేసుకుని తమ ప్రసంగాలతో తాము కౌన్సిలర్ అన్న తీరుగా కోఆప్షన్ సభ్యుల తీరు పట్ల అటు అధికారులు గాని, ప్రతిపక్ష, విపక్ష కౌన్సిలర్లు ఆక్షేపణ చర్యలు చేయకపోవడం విశేషం. ఇదిలా ఉండగా సమావేశంలో భాగంగా వైస్‌చైర్మెన్-2 సి.బి.నైరుతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలన భేష్‌గా ఉందన్న తీరులో ముఖ్యమంత్రిగా జగనన్న, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి చేస్తున్న ప్రజాసేవ కార్యక్రమాలు పట్ల ప్రజలు అభినందిస్తూ ఆశీర్వాదాలను అందచేస్తుండటం శుభపరిణామంగా ఉందనా న్నరు. తాము కౌన్సిలర్లుగా సచివాలయాల కేంద్రాల అధికారుల, వాలంటీర్లుచే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు పథకాలు లబ్దిదారులకు అందచేయడమే లక్ష్యంగా స్థానికంగా తాము పనిచేస్తున్నామన్నారు. తదుపరి చైర్‌పర్సన్ ఎన్.భవాని మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజలకు సేవచేయాలన్న ముఖ్యమంత్రి జగనన్న, ఎమ్మెల్యే వైవిఆర్‌ల ప్రోత్సాహంతో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల నిర్వహణతో ప్రజాసేవకు పాటుపడుతున్నామన్నారు. దీంతో ప్రభుత్వం పనితీరు భేష్‌గా ఉందని తాము కూడా మద్దతు ఇస్తున్నామని తెదేపా కౌన్సిలర్ కృపాకర్ పేర్కొనడం విశేషం. తదుపరి మరో వైస్‌చైర్మెన్ -1 మైమూన్ మాట్లాడుతూ తమ పాలనకు మద్దతుగా భేష్ అన్న టిడిపి శ్రేణులను అభినందిస్తున్నామని, ప్రజల వద్ద కూడా ఇదే తీరున ప్రచారం చేయాలని టిడిపి కౌన్సిలర్లకు చురకలుగా పేర్కొనడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సిల్ నిభంధనలకు తూట్లుగా అతిక్రమిస్తూ ప్రసంగిస్తూన్న ఓ కోఆప్షన్ సభ్యుడు

## జగన్‌రెడ్డి పాలన వద్దు... చంద్రన్న పాలన ముద్దు...

### ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటున్న ప్రజలు....

### - మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్



" ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 27వ వార్డులో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ టిడిపి శ్రేణులు

గుంతకల్లు, డిసెంబర్ 28 ప్రభాతవార్త : ఒక్క అవకాశం అంటూ కోరుతూ నవరత్నాలు పథకాలుగా గత మూడున్నర యేళ్లుగా రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలుగా ముఖ్యమంత్రిగా ఓ సైకో తీరులో జగన్‌రెడ్డి తాను నియంత అన్న ధోరణిలో ప్రభుత్వపాలన సాగిస్తున్నట్లు ప్రస్తుతం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అన్న ధోరణిగా బహిరంగంగాను, గుసగుసలు గాను ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ ప్రజలు వైకాపా పట్ల విసుగుచెం దారని టిడిపి మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ ఉద్ఘాటించారు. టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాలతో అధినేత చంద్రబాబు ఉత్తర్వుల మేరకు " ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమంలో భాగంగా ఆయన అధ్యక్షతన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సంయుక్తంగా బుధవారం గుంతకల్లు పట్టణంలోని 27వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో పర్యటిస్తూ ప్రతి ఇంటి వద్దకు చేరుకుని " ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి " అన్న కరపత్రాల పంపిణీ చేస్తూ ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ జాగృతం కావాలని హితవుగా పేర్కొంటూ రాబోవు రోజుల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును స్వాగతించాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రస్తుత వైకాపా పాలనగా సాగుతున్న తీరులో ప్రధానంగా ప్రజాసంక్షేమంను విస్మరిస్తూ అవినీతి అక్రమాలుగా సంక్షోభకర వాతావరణంను సృష్టిస్తూన్న తీరుపై ప్రజలు రావాలి... కావాలి... అన్న పిలుపులో ఇదేనా అన్న సందిగ్ధంలో ఉండటం భాధాకరంగా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఓ సైకో తీరులోని పులివెందుల రాజారెడ్డి చట్టాలుగా ఓ నియంతలా అందిస్తున్న జ"గన్" సంక్షోభ పాలన వద్దు అన్న సంకేతాలతో రానున్న రోజుల్లో ప్రజాసంక్షేమం తీరులోని చంద్రన్న పాలన ముద్దు అన్న తీరులో తెదేపా విజయంతో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయకత్వంను స్వాగతించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పనితీరులో ఉద్యోగ కల్పనతో నిరుద్యోగులను ఆదుకుంటానని నాడు సచివాలయాల ఏర్పాటుతో వాలంటీర్లు వ్యవస్థను స్వాగతించి ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులకు వేతనాలను సమయానికే కాకుండా సక్రమంగా అందించడంలో ముఖ్యమంత్రిగా జగన్‌రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందిన తీరును ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. నాడు పాదయాత్రలో భాగంగా ప్రజల మధ్య వృద్ధులను సైతం గౌరవిస్తున్న తీరులో ఒక్క అవకాశమంటూ ప్రజలను మభ్యపెట్టి పెట్రోలు,వంటగ్యాస్,వంటనూనెలు, నిత్యవసర సరుకుల ధరల పెంపుదల, ఆర్టీసి బస్సు ప్రయాణాల చార్జీల పెంపుదల వంటి నిర్ణయాలతో పాటు అదనంగా చెత్తసేకరణ అంటూ నూతన పన్నుల పేరుతో భాదుడే భాదుడు తీరులో పన్నులమోతతో ప్రజల జీవితాల నడ్డి విరిచేలా పాలన పట్ల ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. మరోమారు అవకాశం ఇస్తే మరింత నరకమన్న నిజాన్ని విస్మరించకుండా ప్రజలు మేల్కొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అభివృద్ధియే సంకల్పంతో ప్రజాసంక్షేమమే లక్ష్యమైన చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం పట్ల మీ మీ అభిమానాన్ని చాటుతూ విలువైన మీ యొక్క ఓటు హక్కును సద్వినియోగంతో అత్యంత మెజార్టీగా ఓట్లను వేసి స్వాగతించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా శ్రేణులు, కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జ్ శ్రేణులు పాల్గొన్నారు.

## ఈనెల 31లోపు రైతులు ఈకేవైసి చేయించుకోండి

**బత్తలపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** మండలంలోని రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలకు సంబందించి ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసి చేయించుకోవాలని ఏఓ ఓబిరెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 13 విడత పిఎం కిసాన్ ఆర్థికసాయం కోసం ఈనెల 31వ తేదీ లోపు ఈ కేవైసి చేయించకోవాలన్నారు. మండలవ్యాప్తంగా 1674మంది రైతులు ఇంకా ఈ కేవేసి చేయించుకోలేదన్నారు. వారంతా తప్పని సరిగా ఈ కేవైసి చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసామని, రైతులు ఆర్బీకేలలో వారిని కలసి ఈ కేవైసి ఈప్పకండా చేయించుకోవాలన్నారు.

## రహదారికి భూములు కోల్పోయే రైతులతో గ్రామసభ

**బత్తలపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** మండలంలో రహదారి విస్తరణకు భూములు కోల్పోతున్న రైతులతో గురువారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి, ముదిగుబ్బ జాతీయ రహదారి విస్తరణకు రైతులు భూములు కోల్పోతున్నారని, ఈ వివరాలకు పంబందించి ప్రభుత్వం 3డి నోట్‌ను ఇప్పటికే విడుదల చేసిందన్నారు. ఈ రహదారి విస్తరణకు భూములు కోల్పోతున్న రైతులు పట్టాధారు పాసుస్తకం, 1బి, అడంగల్, బ్యాంకు పాసుపుస్తకం నకలు తీసుకుని గురువారం ఉదయం 10.30నిమిషాలకు ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే గ్రామసభకు హాజరు కావాలన్నారు.

## ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు


బేగార్లపల్లి రవి

**మడకశిర డిసెంబర్ 28 ప్రభాతవార్త;** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడు గార్ల ఆదేశాలమేరకు తేదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తేదేపా రాష్ట్ర కార్యదర్శి మాజీ జడ్పిటీసి డాక్టర్ శ్రీనివాసమూర్తి మరియు మండలంలోని తేదేపా నాయకులు పాల్గొని మండల పరిధిలోని బేగార్లపల్లిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తేదేపా నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు బేగార్లపల్లి రవి తెలియజేశారు. ఈ సందర్భంగా బేగార్లపల్లిలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, జిటిఎస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినందులకు అందరికి ధన్యవాదాలను తెలియజేశారు.

## ఓటు బ్యాంకు రాజకీయాలు తగవు

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిఎం శేఖర్


జిఎం శేఖర్ (ఫైల్‌ఫోటో)

**పెనుకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** పెనుకొండ బాబయ్య ఉరుసు సందర్భంగా 30 రోజుల స్వల్ప కాలిక ఎక్జిబిషన్, దుకాణాల ఏర్పాటుకు పెనుకొండ నగర పంచాయితీ కమిషనర్ టెండర్లు పిలవటాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తోందని ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తగదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెనుకొండ అసెంబ్లీ ఇన్‌చార్జ్ జిఎం శేఖర్ పేర్కొన్నారు. బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడటానికి కమిషనర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాబయ్య దరా దగ్గర సర్వే నెంబర్ 222/3లో 10.33 ఎకరాల స్థలం పూర్తిగా ప్రభుత్వ స్థలమని, వక్స్ బోర్డు, బాబయ్య స్వామి దర్గాకు కానీ ఎటువంటి సంబంధం లేదని కమిషనర్ ఆధారాలతో చెబుతున్నారన్నారు. మీకు చెందినవైతే అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ ఆస్తులను అన్ని మాకు చెందినవి అనటం సబబు కాదన్నారు. కొందరుఓటు బ్యాంకు రాజకీయాలు, సంవత్సరాల పాలనా అనుభవం ఉండి అధికార పదవుల్లో ఉండి ఇలా అనాలోచితంగా మాట్లాడటం మంచిదికాదన్నారు. పెనుకొండ ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది అంటే గత పాలకుల చలువే అని ఆయన విమర్శించారు. పెనుకొండ నగర పంచాయితీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ఆయన విన్నవించారు. కమిషనర్ వెంటనే స్థలంకు టెండర్లు పిలిచి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని బిజెపి తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## ఖాతాదారులకు తెలియకుండానే డబ్బు మాయం.. ఇదెలా సాధ్యం

- బయోమెట్రిక్ లాక్ చేసుకోండి

**అగళి, డిసెంబర్28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కర్ణాటక బ్యాంకు తోపాటు అనంత గ్రామీణబ్యాంకులో కూడా ఖాతాదారులకు తెలియకుండానే, వారు వేలిమ ఉద్రలు వేయకుండానే వారి ఖాతాల్లో డబ్బులు మాయం అవుతూన్నాయని, బ్యాంకు ఖాతాదారులు లబోదిబో మంటున్నారు. కర్ణాటక బ్యాంకులో నలుగురుఖాతాదారులవి, గ్రామీణబ్యాంకులో నలుగురు ఖాతాదారులకుచెందిన డబ్బులు మాయం అయినట్లు ఖాతాదారులు అంటున్నారు. తమకు తెలియకుండానే తమ ఖాతాల్లోనిడబ్బు ఎలాపోయిందని సమాచారం మాత్రం వచ్చిందని వారు అంటున్నారు. ఆధార్, వేలి ముద్రలను స్కాన్ కాపీ చేసుకుని ఇలాంటి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డిఎం డీలర్ల వద్ద పెన్షన్ పంపిణీ దారుల వద్ద రైతు భరోసా నగదును తీసుకునే తప్పుడు ఖాతాదారులు వేలిముద్రలువేసి డబ్బులను తీసుకుంటున్నారు. సదరు వేలిముద్రలను ఇలాంటిదొంగలు స్కాన్ చేసుకుని ఖాతాల్లోని డబ్బులను మాయంచేస్తున్నారు. ఈ సైబర్ క్రైంకు ఫిర్యాదు చేయాలంటే 1930 నెంబర్‌కు ఫిర్యాదుచేయాలి. ఇలా నిరక్ష రాస్యతను అమయాకత్వాన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్ల ఆధార్, వేలి ముద్రలను ఇలా స్కాన్ చేసుకుని నకిలీవి తీసుకుని డబ్బులను కాజేస్తున్నారని, ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు తక్షణ పరిష్కారం బయోమెట్రిక్ లాక్ చేసుకుంటే ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు అని గ్రామీణ బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్ కర్ణాటక బ్యాంకు మేనేజర్ శ్రీహరి కిషోర్ తెలిపారు. ఎం.ఆధార్ సైట్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. బయోమెట్రిక్ లాక్ చేసుకోవడానికి ఖాతాదారులకు ఓటిపి వస్తుందని, లాక్ తెరవడానికి కూడా ఓటిపి వస్తుందని దీనిని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాతాల్లో నుంచి డబ్బులు మాయం అయిన వారికి కర్ణాటక బ్యాంకులో ఒకరికి తిరిగిపరిశీలించిఇచ్చారు. మిగతా ఖాతాదారులకు డబ్బులు ఎలా మాయమయ్యాయో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఖాతాలో డబ్బులు మాయమైన వారు సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసుకోవాలన్నారు.

## ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన మరో మరో 12నెలలు పొడిగింపు

**మడకశిర డిసెంబర్ 28 ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల హితాన్ని కోరి దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన మరో సంవత్సరం పాటు పొడిగింపునకు కేబినేట్ ఆమోదం తెలిపిందని బిజెపి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంఛార్జ్ ఎస్.చంద్రశేఖం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అంతోదయ అన్న యోజన పథకం ద్వారా ఉచిత రేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ 2023 డిసెంబర్ వరకు అందిస్తున్నారని ఆయన అన్నారు. రేషన్ కార్డులో ప్రతి మనిషికి ఉచితంగా నెలకు ప్రతి వ్యక్తికి 5కేజీల బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాల్సిందిగా కేంద్ర క్యాబినేట్ మరోసారి తీర్మానించడం అభినందనీయమని చంద్రశేఖర్ అన్నారు. దీని వల్ల సుమారు 81.35 కోట్ల మందికి లబ్ది చేకూరుతుందని అన్నారు. ఈ పథకం ద్వారా 3 కేజీల బియ్యాన్ని 2 కేజీల గోధుమలు పంపిణీ చేయనున్నారని ఆయన అన్నారు. దేశంలో పేదల పక్షపాతి రాజకీయపాఈర్ట ఏదైనా ఉంది అంటే అది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని ప్రజలు భావిస్తారని అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఉచిత ఆహార పంపిణీ డిసెంబర్ 2023 వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం పేదల పెన్నిధి నరేంద్రమోడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర షష్టి పూజ



సుబ్రహ్మణ్యస్వామి షష్టి పూజ కార్యక్రమాల దృశ్యాలు

**ధర్మవరం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** పట్టణంలోని ఎస్ఎల్‌వి మార్కెట్‌లో గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాగుల కట్ట ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్టి పూజలను భక్తాదులు నడుమ పురోహితులు విజయ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహాలకు పాలాభిషేకం, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకంతోపాటు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. తదుపరి వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర విగ్రహాలను పట్టణ పుర వీధుల్లో పల్లకి సేవను నిర్వహించారు. పల్లకి సేవలో స్వామివారి సంకీర్తనలతో మారుమోగాయి. ఈ సుబ్రహ్మణ్య షష్టి పూజ వేడుకలు దాతల ద్వారా నిర్వహించడం జరిగిందని పురోహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

## కొత్తపేట సచివాలయాన్ని ఆకస్మింకగా తనిఖీ చేసిన కమిషనర్ మల్లికార్జున


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ మల్లికార్జున

**ధర్మవరం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** పట్టణంలోని కొత్తపేట లోగల సచివాలయాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో ప్రజలకు చేస్తున్న సేవల విరవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కంప్యూటర్ నమోదు ప్రగతిని తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులోఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందేలా కృషి చేయాలని తెలిపారు. సచివాలయ స్బింది, సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదు అధికారుల ద్వారా పరిష్కరించే దిశగా చేసినప్పుడే సచివాలయానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ చాంద్ బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైభవంగా నాగల మడక సుబ్రహ్మణ్ణేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం


శోభాయ మానంగా అలంకరించిన నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

**పావగడ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** పావగడ తాలూకాలో ప్రఖ్యాతిగాంచిన నాగలమడక సుబ్రహ్మణే య్శర స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మరథోత్సవాన్ని మధుగిరి ఏసి రిపి ఆనంద్ లాంఛనంగా లాగారు సుబ్రహ్మణ్య స్వామికి ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు హాజరై తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుమణి సిఐ కాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బంధోబస్తు నిర్వహించారు.

## ఎమెల్యేని విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదు : కాంగ్రెస్ నాయకులు


విలేకర్లు సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**పావగడ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** పావగడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వెంకటరమణప్పను విమర్శించే హక్కు ఎవరికీ లేదని కాంగ్రెస్ అసమ్మతి నాయకులపై ఆ పార్టీ నాయకులు తీవ్రంగా మండి పడ్డారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ జడ్పి మెంబర్ పాపన్న, ఆర్ఎంసి మాజీ అధ్యక్షులు మంజునాథ్, కాంగ్రెస్ నాయకులు భోజరాజు, రంగే గౌడ్, వాఘేష్, గోపి, నాగమ్మ, నాగరాజప్ప, బిందు తదితరులతో కలిసి బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పావగడ తాలూకా అభివృద్ది చెందిందంటే వెంకటరమణప్ప అధికారంలో ఉన్నప్పుడే జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యేకి విరుద్ధంగా లాయర్ నాగేంద్రప్ప, వదనకల్ గోపాల్‌రెడ్డి, జగన్నాథ్, మాజీ టిపి మెంబర్ హనుమంతరాయప్ప, కోర్ట్ నర్సప్ప, మైలారరెడ్డి తదితరులు చేసిన ఆరోపణలు నిజము కాదని ఖండించారు. ఎమ్మెల్యేపై విమర్శలు చేసే నైతిక హక్కు వీరికి లేదని తెలిపారు. 15 సంవత్సరాల కిందటే పార్టీకి వ్యతిరేకంగా పనిచేసుకుంటూ వస్తున్నారని పార్టీని అడ్డం పెట్టుకుని పదవులు అధికారాన్ని అనుభవించిన కొంతకాలం బిజెపి నాయకుల వెంట తిరిగి ఇప్పుడు తాము కాంగ్రెస్ నాయకులు అంటూ చెప్పుకుంటూ తిరగడం ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం చాలా సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మేకదాటి యోజన, నియోజకవర్గంలో పాదయాత్ర భారత్ జోడో యాత్ర సిద్దరామోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించిన ఆ కార్యక్రమంలో వాళ్ల పాల్గొనడం లేదని పార్టీ కోసం పనిచేయలేదని ఇటువంటి వారు విమర్శలు చేయడం దయ్యాలు వేదాలను వల్లించడమేనని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేపై, పార్టీపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కలిసి పని చేసేందుకు ముందుకు రావాలన్నారు. పావగడ నియోజకవర్గంలో కాంగ్రెస్ అంటే వెంకటరమణప్ప అంటే కాంగ్రెస్ అనే ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పేద ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తూ మరోకవైపు పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేపై విమర్శలు తగదని వీటిని మానుకోవాలని మరోసారి అసమ్మతి నాయకులను హెచ్చరించారు.

## వైఎస్ఆర్ భీమా చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపిపి, ఎంపిడిఓ

**అగళి, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన యశోధ బ్రెయిన్ ఫీవర్‌తో మృతి చెందింది. కుమార్తె సరోజకు లక్ష రూపాయల వైఎస్ఆర్ భీమాను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో తక్షణ సహాయంగా 10వేల రూపాయలను ఎంపిపి రేణుకా కామరాజు, ఎంపిడిఓ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ.. ప్రమాద వశాత్తు పాములు, తేళ్ల కాటువ ల్ల మృతిచెందిన కుటుంబాలను ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ భీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందని, తక్షణ సహాయంగా 10వేలు ఇస్తూమిగతా 90వేలను 15 రోజుల్లో బాధిత కుటుంబానికి అందజేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, సీనియర్ వైకాపా నాయకులు తిప్పేస్వామి, సర్పంచు లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప, వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్, కార్యదర్శి రేణు, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- శ్రీ సత్యసాయి జిల్లా తేదేపా అధ్యక్షులు బికె.పార్థసారథి


మాట్లాడుతున్న బికె.పార్థసారథి


హాజరైన తెలుగు దేశం వివిధ కమిటీ సభ్యులు

**పెనుకొండ, డిసెంబర్ 28 ప్రభాత వార్త :** గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి అన్నారు. బుదవారం పట్టణంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ రియల్ టైం స్టార్ట్ అయ్య (ఆర్‌టిఎస్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వార్డు పరిధిలో ఉన్న కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అవినీతి అక్రమాలను ధరల పెరుగుదల తదితర అంశాలను ఇంటింటికీ తెలియజేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా సైనికుల ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, శిక్షకుడు ముస్తఫా, పరిశీలకులు నరసింహ యాదవ్, మనోహర్ నాయుడు, ఐటిడిపి జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, కన్వీనర్లు సిద్దలింగప్ప, సిద్దయ్య, లక్ష్మిరెడ్డి, రవిశంకర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గాయత్రి, రాంపురం సర్పంచు శ్రీనివాసులు, తెలుగు యువత అధికార ప్రతినిధి జావేద్, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర్‌చౌదరి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామలింగ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు రియాజ్ పాల్గొన్నారు.

## జగన్ అసమర్థ పాలనతో ఆగిన అభివృద్ధి.. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి


మహిళలతో జగన్‌రెడ్డి అసమర్థ పాలలను అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి


రోడ్డుపై మురుగు నీటిని చూపుతూ ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటున్న మాజీ ఎమ్మెల్సీగుండుమల, నాయకులు

**మడకశిర టౌన్, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థ పానలతో రాష్ట్ర అభివృద్ధి ఆగింది, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని రాష్ట్ర తేదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాస్‌మూర్తి మండి పడ్డారు. బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పట్టణంలోని 19, 20 వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. స్థానిక వార్డులలో మురుగు నీటి డ్రైన్లు, శుభ్రం చేయక పారిశుద్యం అస్తవ్యస్థంగా తయారైందని విమర్శించారు. జగన్‌రెడ్డి సర్కార్‌లో పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు కొత్త ఏడాది కానుకగా పింఛన్లు తొలగిస్తూ సాగిస్తుందని రకరకాల నిబంధనలతో కోతలు, వాతలు పెడుతుందని సచివాలయ సిబ్బందితో నోటీసులు ఇప్పిస్తున్నారని, గత తేదేపా ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రెండు వేల రూపాయలు పెన్షన్‌ను అందజేయడం జరిగిందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఏడాది నుంచి ప్రస్తుతమిస్తున్న పెన్షన్ రూ.2500ను 250 పెంచి మొత్తం రూ.2750 ఇవ్వాల్సి ఉందని దాని వల్ల ప్రభుత్వంపై భారం పడనున్న నేపథ్యంలోరాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పెన్షన్లు తప్పించేందుకు నిర్ణయం తీసుకుందని 1000 చదరపు ఆ స్థలం ఉందని, కరెంటు బిల్లు 300 యూనిట్లు పైబడిందని తదితర పలు కారణాలు చూపి పెన్షన తొలగించడానికి నోటీసులు అందించారని పెన్షన్ దారులకు జీవనోపాధి అయిన పెన్షన్ సొమ్మును దూరం చేయాలనుకోవడం జగన్‌రెడ్డికి సరైన విధానం కాదని గత తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం హయాంలో అర్హులైన వారందరికీ పెన్షన్ పథకాన్ని వర్తింపజేశామని కానీ జగన్ సర్కార్ పెన్షన్ అర్హుల జాబితాలో వారి కళ్లల్లో కన్నీళ్లు రప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మనోహర్, కౌన్సిలర్లు నరసింహరాజు, శీనప్ప, ఉమాశంకర్, హనుమంతు, శ్రీణివాసులు, కార్యదర్శి పుల్లయ్య చౌదరి, సత్యసాయి జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్, జిల్లా నాయీబ్రాహ్మణ అధ్యక్షులు రామాంజినేయులు, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, రవి, వైస్ చైర్మన్ నాగరాజు, రవీంద్రారెడ్డి, ఈశ్వర్, బేకర్లపల్లి రవి, చిన్న మల్లప్ప, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటలో పాల్గొనండి

**అగళి, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** కర్ణాటక బ్యాంకులో బంగారు రుణాలు పొంది సదరు డబ్బులను సక్రమంగా కట్టకపోని వారి బంగారు ఆభరణాలను వేలం వేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ శ్రీహరి కిషోర్ తెలిపారు. 6-1-2023 తేదిన బహిరంగ వేలంను కర్ణాటక బ్యాంకులో వేస్తామని వేలం పాట దారులు హాజరై వేలంలో పాల్గొనాలన్నారు. ముద్దన్న కరిదాసనపల్లి, గొల్ల ముద్దరంగప్ప కరిదాసనపల్లి, నాగరాజు కురుసాంగన పల్లి మొదటి వ్యక్తి 18,860 రూపాయలు బాకీ ఉన్నారని, గొల్ల ముద్దరంగప్ప 46,243 రూపాయలు, నాగరాజు 2,51,536 రూపాయలు బాకీ ఉన్నారని అందుకే బ్యాంకులో కుదువు పెట్టిన బంగారు ఆభరణాలను వేలం వేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ తెలిపారు.

## ఏపి మాస్, గుడిబండ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో క్షేత్ర దినోత్సవం


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**గుడిబండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** మండలకేంద్రం లోని ఎఫ్‌పిఓ కార్యాలయంలో క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు చిరుధాన్యాలు, నవధాన్యాలు, పంటలలో ఆశించిన పురుగులు, తెగుళ్ల నివారణ గురించి, ప్రకృతి వ్యవసాయ పద్దతి గురించి అవగాహన కల్పించారు. అలాగే ఏపి మాస్ ద్వారా నిర్వహిస్తున్న క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు నుంచి ఆదర్శ రైతుల వారి యొక్క అనుభవనాలను, వ్యవసాయంలో సాధించిన విషయాల గురించి మండలంఓలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యునిటీ నేచురల్ ఫామింగ్, డిపిఎం లక్ష్మినాయక్, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్‌హరిణి, డాక్టర్ రామయ్య, మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప, మహిళా అభివృద్ధి సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ గోపాల్‌రాజు, శీను, వెలుగు ఏపిఎం తిప్పన్న, మండల సమైక్య అధ్యక్షురాలు తిప్పమ్మ, రైతు సంఘం అధ్యక్షులు రాఘవేంద్ర, కెటి యంజరేగౌడ్, ఎఫ్‌ఓసిసి దేవరాజు, మహిళా అభివృద్ధి సొసైటీ అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్, మండలంలోని రైతు సంఘం లీడర్లు హాజరయ్యారు.

## 42 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు..!

-వివరాలు వెల్లడించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

-రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్‌కు కృతజ్ఞతలు


మంత్రి ఉషశ్రీ చరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** నియోజకవర్గంలోని ప్రస్తుతం అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న 42 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన సొంత భవనాలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేఖరులకు వివరాలు వెల్లడించారు. నవంబర్ 10న తాను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్‌కు వజ్రకరూరు మండలంలో 15, విడపనకల్లు మండలంలో 13, ఉరవకొండ మండలంలో 36 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే వజ్రకరూరు మండలంలో 14, విడపనకల్లు మండలంలో 10, ఉరవకొండ మండలంలో 18 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు అయ్యాయన్నారు. మంజూరు అయిన నూతన భవనాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో 32, నాడు-నేడు నిధులతో 2, నాబార్డు నిధులతో 8 భవనాల నిర్మాణాలు జరుగనున్నాయన్నారు. తాను చేసిన ప్రతిపాదనల్లో మిగిలిన 22 అంగన్‌వాడీ కేంద్రాలకు త్వరలోనే నాడు-నేడు పథకం ద్వారా నూతన భవనాలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత విద్యారంగం ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగ్గా నాడు-నేడు పథకం ద్వారా రూపుదిద్దుకొంటున్నాయని విద్యార్థుల కోసం చేపట్టిన సంక్షేమ విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలు అమలులో లేవని నేడు ప్రతి ఒక్కరూ రాష్ట్రంవైపు చూసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహిళా, శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పౌష్టికాహార లోపం లేకుండా కొత్త మెనూలను ప్రవేశపెట్టారని కొనియాడారు. నూతన అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయడంపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మంత్రి ఉషశ్రీ చరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంత నియోజకవర్గంలో అలజడులు సృష్టించవద్దు..!

-విలేఖరుల సమావేశంలో టీడీపీ నాయకులు


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాత వార్త :** రాష్ట్రంలోనే ప్రశాంతమైన, తెలివైన నియోజకవర్గంగా పేరున్న ఉరవకొండ నియోజకవర్గంలో రెచ్చగొట్టే మాటలతో అలజడులు సృష్టించవద్దని వైసీపీ నాయకులకు టీడీపీ నాయకులు హితవు పలికారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎన్.విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, ఇంద్రావతి మాజీ సర్పంచ్ ఎర్రగుంట్ల వెంకటేష్ తదితరు లు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తెలివైన వారని దౌర్జన్యాలు, కల్లబొల్లి మాటలను సహించరన్నారు. ఎన్నికలొచ్చినపుడు రాజకీయం చేద్దామని కలిసి మెలిసి అభివృద్ధిలో పోటీ పడదామన్నారు. ఈ నియోజవ ర్గానికి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ తమ హయాంలో అవకాశాలను బట్టి ఎంతో కొంత అభివృద్ధి చేశారని అంతేగాని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే అభివృద్ధి జరిగిందని చెప్పి ఎవ్వరినీ మభ్య పెట్టలేరన్నారు. గ్రామాల్లో పార్టీలు, కులాల మధ్య చిచ్చు పెట్టి శాంతికు భగ్నం కలిగించవద్దని హితవు పలికారు. ఇంద్రావతిలో ఎస్సీ కాలనీకు వెళ్లి అడిగితే అక్కడి మహిళలే ఎవరేమి చేశారో చెబుతారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బి.సి.మారెన్న, చాబాల ఎర్రిస్వామి, వరప్రసాద్, చాబాల అల్లాబకాష్, సుంకన్న, రామాంజినేయులు, ఖలందర్, తాజుద్దీన్, నూర్, ఓబయ్య, అనీల్, రామకృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో అభివృద్ధిపై ఎప్పుడు, ఎక్కడ ఏ చర్చకైనా సిద్ధం..!

-అభివృద్ధిని అట్టుకొంటూ..చేసే వారిపై విమర్శలు చేయడం టీడీపీకు కొత్తేమీకాదు-విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే, టీడీపీ నాయకులపై వైసీపీ నాయకుల మండిపాటు


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చందా చంద్రమ్మ

**ఉరవకొండ, డిసెంబర్ 28 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో గత టీడీపీ ప్రభుత్వంలో, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో ఏ గ్రామంలో ఎంత అభివృద్ధి జరిగిందో ఎప్పుడు, ఎక్కడ, ఏ చర్చకైనా తాము సిద్ధమని దమ్ముంటే టీడీపీ నాయకులు చర్చకు ముందుకు రావాలని వైసీపీ నాయకులు సవాల్ విసిరారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ బోయ సుశీలమ్మ, మాజీ వైస్ చైర్మెన్ బోయ సుంకన్న, ఉరవకొండ పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్ల షేక్షావలి, మోపిడి సర్పంచ్ సిద్దప్ప, మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి తదితరులు మాట్లాడారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఇంద్రావతి గ్రామానికి యువనేత వై.ప్రణయ్‌రెడ్డి వెళ్లగా గ్రామ సర్పంచ్ సువర్ణమ్మ ఆహ్వానం మేరకు రోడ్ల పనుల భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారన్నారు. అంతేగాని గతంలో ఏ హోదా లేకపోయినా పయ్యావుల శ్రీనివాసులు మాదిరి లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 12 కోట్ల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు పనులు జరుగుతున్నాయని ఉరవకొండలోనే 5 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత గ్రామం, పంచాయతీలో రోడ్లు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ప్రజలందరికీ తెలుసని 4 సార్లు, ఎమ్మెల్యే, ఒక సారి ఎమ్మెల్సీ విప్‌గా పనిచేసిన ఆయన ఎందుకు రోడ్లు వేయించుకోలేకపోయారో ప్రజలకు చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క సెంటు భూమి కొని ఒక్కరికి పట్టా ఇచ్చి ఒక్క ఇళ్లు నిర్మించలేదని ఉరవకొండలో దివంగత వైఎస్ఆర్ కొన్న 86 ఎకరాల భూమిలో కూడా గత ఎన్నికల సమయంలో 14 సర్వే నంబర్లతో బోగస్ పట్టాలు పంచి పేదలను మోసం చేశారన్నారు.యువనేత ప్రణయ్‌రెడ్డి బయటకు అడుగు పెడితే పయ్యావుల కుటుంబ, టీడీపీ నాయకులకు వెన్నులో వణుకు పుడుతోందని ఆయన సందించే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. నేడు వైసీపీ ప్రభుత్వంను విమర్శిస్తున్న టీడీపీ నాయకులు ఏఏ సంక్షేమ పథకాల్లో ఎంతమేర లబ్దిపొందారో లెక్కలతో సహా చెబుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు బి.తేజోనాథ్, యం.అశోక్‌కుమార్, కె.గోవిందు, జి.వన్నప్ప, ఈడిగ ప్రసాద్, ఇంద్రావతి వెంకటేశులు, ఉస్మాన్, ఎర్రిస్వామిరెడ్డి, ధనుంజయ, అంగడాల అంజి, జోగి విజయ్, జోగి బీమన్న, కాసుల ఆంజినేయప్రసాద్, ఓబయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

